"అయితే యిప్పుడేదో అంటివే? అది నీకుంది! నాకు లేదా తాతా?"

పూర్వజన్మమేదో పరజన్మమేదో తెలియని ముసలయ్య అమాయకంగా 'గలగల' అడిగాడు. అంతకంటే అమాయకంగా నవ్వేశాడు తాత!

"ఎందుకు తాతా నవ్వుతుండావు?"

"లేదు ముసలయ్యా! నువ్వడిగినమాట తల్చుకొంటే ఒక కత మతికొస్తూ ఉంది."

"కతనా! అయితే చెప్పు తాతా! నిద్రేమో రాలేదు. అదన్నాయింటాను."

"అనగనగా ఒక రాజు. ఆ రాజుకూ దేవుడికీ నూరాంవడల దూరం. వాళ్ళిద్దరిమధ్య పచ్చిగడ్డి యేస్తే భగ్గున మండేదట. కాని అతనికి పుట్టినబిడ్డ మాత్రం దేవుడంటే పడిచచ్చేవాడు. ఇచ్చిత్రంగా ఉంది గదా? అందుకే అబ్బకొడుకులకు పొత్తుకుదరలేదు. ఆ దేవునిమాట తలపెట్టద్దని రాజు నెత్తిన నోరుపెట్టుకొని మొత్తుకొన్నాడు. కొడుకు పెడచెవిని పెట్టినాడు. దాంతో రాజు 'కుతకుత' ఉడికిపోయినాడు. బిడ్డను పాములచేత కరిపించినాడు. సలసలకాగే నూనెలో తోయించినాడు!"

"నువ్వు చెప్పేది బలే ఉంది తాతా! పాములసేత కరిపిస్తే మళ్ళీ బతికితేగదా నూనెలో తోయించడానికి?"

"అదే నాయనా! ఆ దేవుడిమహిమ. అక్కసుకొద్దీ రాజు ఏంవి చేయించినా బిడ్డ చెక్కుచెదరలేదు. తన దారి తప్పలేదు. కడకు 'దేవుడు! దేవుడు! అంటున్నావే? ఎక్కడుండాడ్రా నీ దేవుడు?' అని నిలదీసి అడిగినాడు రాజు. 'ఎక్కడ పదితే అక్కడున్నాడు దేవుడు' అని ఆ బిడ్డ సమాధాన మిచ్చినాడు. దాంతో ఆ రాక్షసరాజు రెచ్చిపోయి, ఈ స్తంభములో ఉన్నాడా నీ దేవుడు?' అని అడిగితే 'ఓ' అన్నాడు. అంతే! రాజు ఎగిరి తన్నినాడు ఆ స్తంభాన్ని! ఆ బిడ్డమాట పొల్లుపోలేదు నాయనా! దేవుడక్కడ వెలిసినాడు!"

రెండుబళ్ళు యిటు దున్ని విత్తనంవేస్తే బ్రహ్మాండమైన పంట కనుల పండువు గొలుపుతుంది!

ఇప్పుడు మునలయ్య, తాత తత్త్వాలంటే విసుగుపడడం లేదు. పైగా తాతకు ముందే నిద్ర లేస్తున్నాడు. మంచినీళ్ళగుంటలో మునుగుతున్నాడు. తాత తత్త్వాలు పాడుతుంటే, నిశ్చలంగా దేవునిముందు కూర్చుని "నన్ను మంచిదారిన నడిపించు సామీ!" అని మొరపెట్టుకొంటున్నాడు.

"ఒరే! యీ యిచ్చిత్రం యిన్నావంట్రా?"

"ఏమిట్రా అది? చంద్రలోకానికి నిచ్చెన్లేసేదానికి రష్యావాడు అమెరికావాడు పోటీపడడంవా?

"రష్యావాడు రగిలిపోనీ, అమెరికావాడు ఆరిపోనీ! మన కెందుకు?- మన పరమాత్ముడి సంగతిరా?"

"వాడికేంవయిందిరా? ఇంతకుముందే చూస్తిని. 'చెప్పలేదం టనకపొయ్యేరు' అని రాగాలు తీస్తా పెదబాయిలో కపిల తోల్తా ఉండె!"

"వాడికేమీ కాలేదుకానీ. ఈ పొద్దో రేపో 'టిక్కట్టు' తీసుకొనేట ట్లుందని సందేహం కలిగినట్లుందిరా! తన పరమాత్ముని 'పట్టం' గురించి ఒకే తపనపడుతూండె. ఆ దిగులు తీరినట్లుందిరా!"

"కొంపదీసి నువ్వేమైన ఒప్పుకొన్నావురా ఆ పట్టం కట్టుకోవ దానికి!"

"ఓస్ నాసురకంవా? మన కెక్కడిదిరా ఆ బాగ్గెం....దానికంతా పెట్టి పుట్టాలిరా నాయనా! వాడుండ్లా మన మునిలిగాడు...."

"అయితే తాత పెదపరమాత్ముడైతే, మునిలిగాడు చినపరమాత్ము డైనాడన్నమాట మన పాలిటికి!"

ఆ మాటతో ఆ పల్లెలోని కుట్టికారు గొల్లుమంటుంది.

ఈ మాటలు అక్కడక్కడ వినిపించదానికి ఆ పల్లెలో ఎక్కువ కాలం పట్టలేదు!

పాయకట్టులో వాళ్ళంతా దేవుడంటి మనిషని చెయ్యెత్తి దండంపెడుతూంటే నీకెందుకు పుట్టిందయ్యా యీ పాడుబుద్ధి?"

మునలయ్య విచారణ ఆరంభమయింది.

మునలయ్య ఏమీ బదులుపలుకలేదు. 'మునలయ్య తప్పితే ఎవ్వరూ నోరెత్తరాదు'—అని అంతకుమునుపే నిర్ణయించుకొన్న యువజనసంఘం ఊపిరి బరువుగా పీలుస్తూ వుంది.

"నువ్వేపని చేసినా, ఊరి మంచికోసమేనని అనుకొంటూ వుంటిమి. అందుకే నువ్వు ఆడింది ఆట! పాడింది పాట! ...కానీ ముండమొగాన బొట్టుపెట్టడం మాత్రం...."

"అదిగాదు బావా? ఆ అమ్మాయి ముండమోసింది నిజమే! కానీ, వయసుచెల్లికాదు. తన రాత అట్లరాసింది కాబట్టి! పట్టుమని పదహారేళ్ళయినా నిండలేదు. దీనికితోడు చక్కని రూపాన్నిచ్చినాడు ఆ పాడుదేవుడు. దీంతో పదిమందీ ఆమెచుట్టు తిరుగుతారు. వయసు చెడ్డది బావా! ఏనాడో ఒకనాడు పొరపాటుగా కాలుజారితే మిగిలేవి కళ్లల్లో నీళ్లు! అప్పుడు యీ పదిమందిలో ఎవ్వరూ కళ్ళ నీళ్ళు తుడవలేరు. కాళ్ళపై నిలబెట్టలేరు. అదిగాక ఆ ఒక్క అమ్మాయిని గురించి యీ పదిమందీ చెడినవాళ్ళవుతారు. దానికంటే యిది మంచిది గాదా బావా?" నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు మునలయ్య.

"కళ్లల్లో నీళ్ళు తుడువడానికీ, కాళ్ళపై నిలబెట్టడానికి నా కొడుకొకడే కనిపించినాడా? ప్రెసిడెంటయినప్పుడేమో నన్ను, యిప్పుడేమో నా కొంపను మంటగలిపితిరి. సరిపోతుందా?....పాలు అన్నం తినే పదిమందీ చెప్పండి."

చిన్నసామి ఆవేశము ఆవిర్లు కక్కుతూ వుంది.

"మేమెవరినీ పడేసి పంగనామాలు పెట్టలేదు. పెట్టినా దాసర్లు కాలేరు. వాళ్ళిద్దరూ ఒప్పుకొంటేనే మేము నాలుగు అక్షింతలు వేశాము."

